క్లుప్తంగా

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన ఘటనలో భర్తపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని చుండువారివీధికి చెందిన ఆఫ్రియా బేగానికి కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నూరి అహ్మద్‌తో వివాహమైంది. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. అదనపు కట్నం కోసం ఆమెను భర్త వేధించసాగారు. పలుమార్లు పెద్దలు సర్దిచెప్పేందుకు యత్నించినా అతను పట్టించుకోలేదు. వేధింపులను తాళలేని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని దండిగుంటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ మేరకు విడవలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు.. దండిగుంట గ్రామంలో కొందరు సరదగా ఆటలు ఆడుతుండగా గ్రామానికి చెందిన మేకల శీనయ్య వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న దండిగుంట ధనంజయ ఎందుకు వచ్చాయని అడిగాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో శీనయ్య ఓ కర్రను తీసుకుని ధనంజయ తలపై దాడి చేశాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. అనంతరం శీనయ్య కుమారుడు ఏసోబు కూడా కర్రతో ధనంజయ కాళ్లపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. దాడి ఘటనకు సంబంధించి శీనయ్య, ఏసోబుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విడవలూరు ఎస్సై ఆంజనేయులు కోరారు. విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చే విషయంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఏవీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేగంగా ఆధార్ అనుసంధానం



బుచ్చిరెడ్డిపాళెం: ఓటుకు ఆధార్‌ను అనుసంధానం కార్యక్రమాన్ని వేగంగా చేయాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆదేశించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అనుసంధానంలో బుచ్చిరెడ్డిపాళెం వెనుకంజలో ఉందని, దీనిపై దృష్టి సారించి ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇంటి, కుళాయి పన్నులను త్వరగా వసూలు చేయాలన్నారు. సమీక్షలో ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ పద్మజ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

వెంకటాచలం : మోటార్‌బైక్ అదుపుతప్పి పడడంతో యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కసుపూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరం కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా మలుపురోడ్డు వద్ద ఎదురుగా టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో సయ్యద్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనపై దృష్టి సారించండి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని 15 పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. విడవలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భవానమ్మ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపించడంతో తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఇంటి, కుళాయి పన్నులపై దృష్టి పెట్టి వాటిని నూరుశాతం వసూలు చేసే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, వైస్ ఎంపీపీలు సౌందర్య, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌కు గ్రహణం

- 16 నెలలుగా మూతపడిన వైనం
- భారీగా పెరిగిన మరమ్మతుల ప్రతిపాదనలు
- తాగునీటికి కటకట
- ఇష్టారాజ్యంగా పుట్టుకొస్తున్న ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు



నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

నెల్లూరు రూరల్: ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు గానూ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులో ఏర్పాటు చేసిన భారీ మినరల్ వాటర్ ప్లాంట్‌కు గ్రహణం పట్టింది. దాదాపు 16 నెలలుగా మూతపడటంతో స్థానికులకు ఇక్కట్లు తప్పడంలేదు. గతంలో ఇక్కడ రెండు రూపాయలకు స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలు పొందేవారు. అయితే ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15 వరకు వెచ్చించి క్యాన్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరమ్మతులకు గురైన ప్లాంట్‌ను బాగు చేయించడంలో నగరపాలక సంస్థ నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు

బుజబుజనెల్లూరు, పరిసర ప్రాంతాల్లో గతంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉండేది. చిన్న వయస్సులో సర్పంచ్‌లుగా ఎన్నికైన వారికి అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో రాజీవ్‌గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఢిల్లీలో సత్కారాలను ఏర్పాటు చేశారు. అప్పటి సర్పంచ్ నరేష్ తన గ్రామంలోని తాగునీటి ఎద్దడిని వివరించారు. దీంతో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు. రూ.3.5 కోట్లతో గంటకు ఐదు వేల లీటర్ల నీటిని శుభ్రపర్చేలా ప్రణాళికలను రూపొందించారు. రోజూ 1.2 లక్షల లీటర్ల నీటిని ప్యూరిఫై చేసి అందులో నుంచి 50 వేల లీటర్లను స్వచ్ఛ నీరుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. 2012 ఏప్రిల్లో ప్రముఖ శాస్త్రవేత్త స్వామినాథన్, సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారుల పర్యవేక్షణలో ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఫిల్టర్ చేసి చెరువులోకి విడుదల..

మినరల్ వాటర్ ప్లాంట్‌లోని వృథా నీటిని విడుదల చేసేందుకు గానూ కిలోమీటర్ దూరంలోని జాతీయ రహదారికి దిగువన ఉన్న చెరువు వరకు పైపులను వేసి అక్కడ ఫిల్టర్ పాయింట్‌ను నెలకొల్పారు. ఎలాంటి కెమికల్స్ లేవని నిర్ధారించాక వివిధ దశల్లో వృథా నీటిని ఫిల్టర్ చేసి చెరువులోకి వదిలేవారు. చెరువులోని చేపలకు సైతం ఫీడ్ వేసేవారు. పంటలకు ఎలాంటి హానిలేకుండా తరచూ నీటిని పరీక్షించేవారు. అయితే ప్రస్తుతం ఈ ఫిల్టర్ పాయింట్ నిరుపయోగంగా మారింది.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు

బుజబుజనెల్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు ఎలాంటి అనుమతుల్లేకుండా ఏర్పాటవుతున్నాయి. నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పాటించకపోగా, క్యాన్‌ను రూ.పది నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెరిగిన ప్రతిపాదనలు

ప్లాంట్ వినియోగంలో లేకపోవడంతో యంత్రాలు మరమ్మతులకు చేరుకున్నాయి. ప్లాంట్ పునరుద్ధరణకు గానూ చెన్నైకి చెందిన టెక్నీషియన్లను ఏడాది క్రితం రప్పించారు. అప్పట్లో రూ.3.5 లక్షల వరకు ఖర్చవుతుందని ప్రతిపాదించారు. అప్పట్లో నిధులను కేటాయించకపోవడంతో యంత్రాలు మరింత తుప్పుపట్టాయి. ఇటీవల మరోసారి ప్రతిపాదనలను రూపొందించగా, అంచనాలు రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చేరాయని సమాచారం. ఈ నిధులను కేటాయిస్తే ప్లాంట్ వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

గతంలో ఇలా..

వాటర్ ప్లాంట్ వినియోగంలో ఉన్న సమయంలో రెండు రూపాయలకే వాటర్ క్యాన్‌ను అందించేవారు. బుజబుజనెల్లూరు, కొత్తూరు, వెంకటాచలం మండలం చెముడుగుంట పరిధిలోని ప్రాంతాల వారు ఇక్కడ మినరల్ వాటర్‌ను తీసుకెళ్లేవారు. నిత్యం 1800 నుంచి రెండు వేల క్యాన్లను వినియోగించేవారు. చెన్నైకి చెందిన వారు ప్లాంట్‌ను ఏడేళ్ల పాటు నిర్వహించారు. ఈ ప్రాంతం నగరపాలక సంస్థలో విలీనమయ్యాక ప్లాంట్‌ను కార్పొరేషన్‌కు అప్పగించారు. కొంతకాలం పాటు నిర్వహించిన అధికారులు తదనంతరం నిర్లక్ష్యం చూపడంతో ప్లాంట్ మూతపడింది.



తుప్పుపడుతున్న యంత్రాలు

పరిశీలించి చర్యలు చేపడతాం

ఇటీవలి కాలంలో బాధ్యతలు స్వీకరించా. ప్లాంట్ విషయం ఈ మధ్యే తెలిసింది. మూతపడిన వాటర్ ప్లాంట్‌ను త్వరలో పరిశీలించి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతాం. ప్రజల తాగునీటి అవసరాలపై దృష్టి సారిస్తున్నాం.

– హరిత, కమిషనర్

పునరుద్ధరించాలి



మూతపడిన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలకు నీటి కష్టాలను తొలగించాలని పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించుకున్నా, పట్టించుకునే వారే కరువయ్యారు.

– అజీజ్, రహమత్‌నగర్, బుజబుజనెల్లూరు

అధికారుల నిర్లక్ష్యం



ప్లాంట్ వినియోగంలో లేకపోవడంతో యంత్రాలు తుప్పుపట్టిపోతున్నాయి. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అనుమతుల్లేని ప్లాంట్లలో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

– రామకృష్ణ, బుజబుజనెల్లూరు

అందుబాటులోకి తీసుకురావాలి



గతంలో వాటర్ ప్లాంట్ వద్ద చౌకగా నీటి క్యాన్లను పొందేవాళ్లం. ప్రస్తుతం మూతపడటంతో అధిక ధరలకు నీటి క్యాన్లను కొనుగోలు చేయాల్సి వస్తోంది. పేదలను దృష్టిలో ఉంచుకొని ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– అల్లెమ్మ, బుజబుజనెల్లూరు

తాగునీటికి అవస్థ పడుతున్నాం



కుళాయిల్లో వచ్చే నీరు కలుషితంగా ఉంటోంది. విధి లేక బయటి ప్రాంతాల్లో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్లాంట్‌ను పునరుద్ధరిస్తే బాగుంటుంది.

– బాషా, బుజబుజనెల్లూరు

మర్యాదపూర్వకంగా..





నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలిగా రెండోసారి ఎన్నికైన కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పలువుర్ని గురువారం కలిశారు. రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు.. ఎంపీ, పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి సత్కరించారు.

ఆ పర్వతశ్రేణులు చైతన్య దీపికలు



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు(బృందావనం): సతారా పర్వతశ్రేణులు జాతి చైతన్యానికి ప్రగతి దీపికలని.. సాక్షాత్తు దైవంగా భావించే సమర్థరామదాసు బ్రహ్మీభూతమై కొలువైన పుణ్యస్థలి సజ్జన్‌ఘడ్ కోట అని ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఉత్తర చిదంబర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన సతారా వైభవం.. సజ్జన్‌ఘడ్ కోట ప్రాశస్త్యాన్ని పురమందిర ప్రాంగణంలో గురువారం ఆయన వివరించారు. వివిధ యుగాల్లో వివిధ అవతారాల్లో ఉన్న రాక్షసులు.. కలియుగంలో రాక్షస రూపాలను వీడి మనుషుల్లో తిష్టవేసి పలు అకృత్యాలకు కారణభూతులవుతున్నారని చెప్పారు. ప్రస్తుత సమాజ పోకడల కారణంగా ప్రతి ఒక్కరూ ధర్మరక్షణపై జడత్వంతో వ్యవహరిస్తున్నారని, దీంతో అధర్మం ప్రజ్వరిల్లుతోందని పేర్కొన్నారు. ప్రతి సమయంలో భగవంతుడే వచ్చి ధర్మాన్ని సంరక్షిస్తారనే ఆలోచనను వీడాలని చెప్పారు. హైందవ ధర్మ రక్షణకు కృషి చేసిన శంకరాచార్యులు, సమర్థరామదాసుకు ఏ ఒక్కరూ సరిపోరని వివరించారు. సతారా పర్వతశ్రేణుల చెంతకు తల్లిదండ్రులు తమ పిల్లలను జీవితంలో ఒక్కసారైనా తీసుకెళ్తే వారి జీవితాలు ధన్యమవుతాయన్నారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావును భరద్వాజ రుద్రాభిషేక సంఘ తరఫున ఆడిటర్ రాఘవేంద్రరావు, అడ్వొకేట్ ఫణిరత్నం, రాఘవేంద్రరావు, నారాయణరావు, నరసింహ, సుబ్రహ్మణ్యం, సుబ్బునారాయణ, ఫణిసుమంత్ సత్కరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

నెల్లూరు(క్రైమ్): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో మహిళా చట్టాలు, దిశ యాప్, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ నిబంధనలు, తదితర అంశాలపై అవగాహన సదస్సులను పోలీస్ అధికారులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థినులు తమ ఫోన్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టల్ చేసుకోవాలని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని చెప్పారు. అన్ని కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ అధికారితో కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్స్‌కు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగం, తదితరాలను గుర్తిస్తే డయల్ 100, దిశ యాప్, 112కు సమాచారం అందించాలని కోరారు.

శరణాగతుడికి ఎల్లవేళలా దైవానుగ్రహం



ప్రవచిస్తున్న గరికపాటి నరసింహారావు

నెల్లూరు(బృందావనం): శరణమన్న వారికి భగవంతుడి అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. వేదాయపాళెం కూడలిలో శ్రీనివాస కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించనున్న శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వర శరణాగతిపై ధార్మిక ప్రవచనలను గురువారం జరిపారు. జన్మతః కర్మఫలాలు సిద్ధిస్తాయని, వీటిని ప్రతి ఒక్కరూ అనుభవించకతప్పదని తెలిపారు. కర్మఫలాల నుంచి చింతలేని జీవితాన్ని గడపాలంటే భగవంతుడి శరణు ఒక్కటే మార్గమన్నారు. దైవచింతనతో జీవితం సుఖమయమవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు భగవత్ స్వరూపులన్నారు. కష్టసుఖాలను తేలికగా తీసుకొని సాగే వారి జీవితం ధన్యమని తెలిపారు. శరణుజొచ్చిన వారిని కలియుగదైవం శ్రీనివాసుడు ఎలా అనుగ్రహిస్తారో వివరించారు.

కేంద్ర నిర్ణయం అభినందనీయం

ఆరేళ్లు వచ్చే వరకు ఎవర్నీ పాఠశాలల్లోకి అనుమతించకూడదంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. చిరు ప్రాయం నుంచే వారిని పుస్తకాలు, తరగతి గదులకు బందీలుగా చేయడం ద్వారా తల్లిదండ్రుల ప్రేమానురాగాలు, కుటుంబ వ్యవస్థ, సమాజంపై అవగాహన కోల్పోయి నిరర్థకులుగా తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆక్రమణను అడ్డుకోరూ..

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వానికి సంబంధించిన 3.8 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు ఆత్మకూరు మండలం కరటంపాడుకు చెందిన ఓ వ్యక్తి యత్నిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని అదే గ్రామానికి చెందిన కామాక్షమ్మ, అమ్మాజీ కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో గురువారం వారు మాట్లాడారు. సదరు భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

చిరు ధాన్యాలతో ఎంతో ఉపయోగం



నెల్లూరు(సెంట్రల్): చిరు ధాన్యాలతో ఎంతో ఉపయోగమని, వీటి పెంపకాన్ని ప్రోత్సహించాలని సీనియర్ ఐపీఎస్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బీవీనగర్ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. చిరు ధాన్యాల పెంపకంపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కేవీకే శాస్త్రవేత్త లోకేష్‌బాబు, డాక్టర్ సుజాత, డాక్టర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. 31వ డివిజన్లోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ రోడ్డులో గల చవటగుంట, విజయలక్ష్మీనగర్, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్తసేకరణ పనులను అధికారులతో కలిసి గురువారం పర్యవేక్షించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను సందర్శించి.. చెరువు నీటిని పరిశీలించారు. వివిధ విభాగాల్లో జరుగుతున్న మంచినీటి శుద్ధి విధానాలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. తాగునీటి పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా తిరిచ్చి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో తీర్థవాది, ధ్వజావరోహణ, తిరిచ్చి ఉత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలను విశేషంగా జరిపారు.

మార్గదర్శకాలను తప్పక అమలు చేయాలి



నెల్లూరు సిటీ: సఫాయి మిత్ర సురక్ష చాలెంజ్ అమల్లో భాగంగా కార్పొరేషన్ పరిధిలో నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పక అమలు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్పొరేషన్ అందిస్తున్న యూనిఫారం, గ్లౌజ్‌లు, హెల్మెట్, షూస్, మాస్కులను కార్మికులు తప్పక ధరించాలని సూచించారు. భూగర్భ డ్రైనేజీ పనుల్లో భాగంగా మ్యాన్ హోళ్ల శుభ్రతకు యంత్రాలను మాత్రమే వినియోగించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉత్తమ ర్యాంక్‌ను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

షాహినాకు ఘన సన్మానం



నెల్లూరు(క్రైమ్): ఏపీ విలేజ్ అండ్ వార్డు సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జిల్లా మహిళా పోలీస్ షాహినాను సత్కరించారు. జ్యోతినగర్‌లోని వసుజ్యోతి కార్యాలయంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను సన్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి, పీఎంపీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

శ్రీహరినగర్‌లో చోరీ

- 11 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

నెల్లూరు(క్రైమ్): కుటుంబంతో కలిసి ఊరెళ్లిన వ్యక్తి ఇంటిని దుండగులు దోచేసిన ఘటన శ్రీహరినగర్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. శ్రీహరినగర్‌లోని పాతకాలువ కట్ట వద్ద నివాసం ఉంటున్న విశ్వనాథ్ తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు ఈ నెల 22న వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా లాకర్‌ను తెరిచి అందులోని రూ.4.4 లక్షల విలువజేసే 11 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఇంటికి చేరుకున్న బాధితుడు చోరీ జరిగిందనే అంశాన్ని నిర్ధారించుకొని బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ రాములునాయక్, ఎస్సై మహబూబ్ సుభానీ పరిశీలించారు. ఘటన స్థలంలో వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నగరంలో వరుస దొంగతనాలు అటు ప్రజలు, ఇటు పోలీసులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

నెల్లూరు(క్రైమ్): తల్పగిరి కాలనీలో దారుణ హత్యకు గురైన అనుదీప్ కేసులో దర్యాప్తును వేదాయపాళెం పోలీసులు వేగవంతం చేశారు. తన భార్యతో సన్నిహితంగా ఉన్నారనే అనుమానంతో అతడ్ని సురేష్ హతమార్చారని పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ఇన్‌స్పెక్టర్ నరసింహారావు నేతృత్వంలో ప్రత్యేక బృందం సాంకేతిక సాయంతో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హత్య అనంతరం తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి ఇతరుల ఫోన్ ద్వారా కుటుంబసభ్యులు, స్నేహితులకు నిందితుడు ఫోన్ చేశారని తెలిసింది. సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా గూడూరు, పొదలకూరు ప్రాంతాల్లో ఉన్నారని తేలడంతో అక్కడికి చేరుకొని విస్తృతంగా గాలించారు. అయితే అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. హత్య ఆయనొక్కరే చేశారా.. ఇంకెవరైనా సాయం చేశారాననే వివరాలు తెలియాల్సి ఉంది. నిందితుడి ముఖ్య స్నేహితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని సమాచారం.

చోరీ ఘటనలో ముమ్మరంగా దర్యాప్తు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని మిలటరీ కాలనీలో జరిగిన భారీ చోరీ కేసులో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య విభిన్న కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటన స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ వ్యక్తి మొహానికి మాస్క్ ధరించి అనుమానాస్పదంగా ఉండటాన్ని గుర్తించారు. మాస్క్ ధరించి ఉండటంతో నిందితుడ్ని గుర్తించడం కష్టతరంగా మారిందని సమాచారం. అదే ఆనవాళ్లతో ఉన్న ఓ పాత నేరస్తుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, అతను కాదని తేలిందని తెలుస్తోంది. అతని ద్వారా నగరంలోని యడ్లవారివీధిలో క్యాటరింగ్ పనులు చేస్తున్న ఓ వ్యక్తి అని తెలుసుకొని ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి ఆరా తీశారని సమాచారం. అతనూ కాదని తేలడంతో వెనుదిరిగారు. ఇప్పటికే ఓ బృందం విజయవాడ, ఒంగోలులో విచారణ జరిపారని సమాచారం.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. మినీబైపాస్‌లోని వెంకటరెడ్డి నగర్‌కు చెందిన ప్రసాద్, లక్ష్మి అన్నాచెల్లెళ్లు. మినీబైపాస్‌లోని ఓ పార్టీ కార్యాలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు భోజనాన్ని ఆమె అందించేవారు. ఈ నెల 17న భోజనాన్ని అందించి ఇంటికి బయల్దేరిన ఆమె జాడ తెలియరాలేదు. కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లభించలేదు. దీంతో బాలాజీనగర్ పోలీసులకు ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఎస్సై మహబూబ్ సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.